"మేలుకోవయ్యా...
మమ్మేలుకోరామా...."

భూపాల రాగంలో, మంద్రస్థాయిలో వినిపించే ఆ మధుర వాణికి ఆకాశం అరుణిమను దాల్చుకుంది. సూర్యుడు నిద్రలేచి కొండలచాటు నుంచి తొంగి చూశేడు. పాలవృక్షంమీది గువ్వలజంట కువకువ లాడుతూ నిద్రలేచినాయ్. పొద లలోని కుందేళ్ళు కళ్ళు తెరచి, చెవులు విప్పారించినై।

చేవదేరి పోతరించి వున్న మద్ది వృక్షాలు, మాధవీలతలతో కూడిన మామిడి వృక్షాలు. కేతకి లతలతో ఆవ రించబడిన తుమ్మికరావి చెట్లు, మధూక లతలతో నిండిన మొండి వృక్షాలూ, సం పంగి పొదలూ, మొగలి పొదలూ ఆ నందంతో తలలూపు తున్నాయి.

ప్రక్కనేవున్న సెలయేరు గల-గలా శబ్దంచేస్తూ ప్రకృతికి నేపథ్యం పాడు తోంది.

వకుళ, ఉద్దాలక, సంపంగులు, మం దారం, జాజులూ, పున్నాగులూ. వాసం తులూ. గులాబులూ విరగబూసి ఆ ప్రాంతానికో వింత సోయగాన్నీ, సువా సనల్నీ పంచి పెడ్తున్నాయి.

"ఎంత నిన్నె వర్ణింతును శబరి.... భాగ్యదాంతలు, వరకొంతలు-జగమంతగ నిండియుండగ...." ముఖారి భూపాల రాగాలు మేళవించి కుటీరం ముంగిట ముగ్గువేస్తూ రాగాలాపన చేస్తోంది. శ్వేత వస్త్రధారిణి తడిచిన బట్టలతో, వీపుపైన జీరాడే కురులతో వనకన్యలావుంది ఆస్త్రీ। నిర్మలమైన మొహంతో మొహంలోని వింత తేజస్సులు ప్రపంచానికి "కాంతి"ని పంచడానికి వచ్చిన శాంతి దూతలా వుంది.

పర్ణశాల చుట్టూవున్న కంచె "లక్ష్మణ రేఖ"లా వుంది పర్ణశాల గోవుపేడతో అలకబడి, ముగ్గులతో అలంకరింపబడి వుంది. పర్ణశాల ఆవరణలో మేక ఒకటి స్వేచ్ఛగా నంచరిస్తూ గరికను కొరుకు తోంది।

పొదలలో వున్న కుందేలు కుప్పిగం తులువేస్తూ "వనకన్య" చీర అంచులను కొరకసాగింది. లేచిగుళ్ళనే భ్రమతో కాబోలు।

"ఏం(చి)టానాసీ" వీణమీటి నట్లు కుం దెలు వెన్నునిమిరి పలకరించిందా వన కన్య.

"రా....రమ్మ"న్నట్లుగా చీర చెం గును లాగింది కుందేలు....గంతులువేస్తూ ముందుకు పోయిం౨. ఆసక్తిగా చూసి కుందేలును అనుసరించిందామె। పర్ణ శాల వాకిట్లో....పొదల ప్రక్కన రక్త సిక్తమై పడివున్నాడో మనిషి। ఆమె మనసేదో తెలియని ఆందోళనకు గుర యింది. అతని తెల్లటి బట్టలు మట్టి గొట్టుకపోయి రక్త చారికలతో అస హ్యంగా వున్నాయి. భుజం మీద గాయం పైని రక్తం గడ్డకట్టి వుంది. ఈగలు ముసురుతున్నాయి. అతని గడ్డం మాసి పోయి మొహంలో అలసట స్పష్టంగా

# అన్వేషి

టి. ఎస్. ఆర్. కె. గాంధి

కనిపిస్తోంది. చుట్టు ప్రక్కల ఎవరయినా కనిపిస్తారేమోనని పరికించి చూసింది. పక్షుల కిలకిలారావాలు, మూగజీవాల కదలికలు తప్ప మానవ సంచారంగానీ, అలికిడిగానీ వినిపించలేదు. వంగి అతని నాడి చూసింది. బలహీనంగా కొట్టుకొంటోంది. ప్రక్కనే వున్న సెలయేటిలో తన చీరకొంగు తడిపి. తామరాకు దొన్నెతో నీళ్ళు తీసుకవచ్చింది. తడి గుడ్డతో మోహం శుభ్రంగా తుడిచింది. అస్పష్టంగా మూలిగేడు. ఎండిపోయిన పెదవుల్ని కొద్దిగా కదిలించేడు. తామరాకు దొన్నెలోని నీళ్ళను అతనికి త్రాపిందామె. మెల్లిగా కళ్ళు తెర్చేడతడు. కృతజ్ఞతా పూర్వకంగా చూశేడు.

"లేచి నిల్చోగలరా?" అడిగిందామె.

తలూపేడు. ఆమె ఆసరాతో, అతి భారంగా అడుగులేస్తూ లోనికి నడిచేడు. జింక చర్మంపైని పరుండబెట్టింది. మేకపాలు పితికి అతని కిచ్చింది. అడవిలోని ఆకులను పరిపసరుపిండి అతని భుజంకు కట్టుకట్టింది.

"మీకు శ్రమ ఇస్తున్నాను" చేతులు జోడించేడు.

"మీరు చాలా బలహీనంగా వున్నారు. విశ్రాంతి తీసోక్కండి. తర్వాత మాట్లాడుకోవచ్చు" అనునయంగా చెప్పిందామె.

మగతగా కళ్ళు మూసేడు. తిరిగి కళ్ళు తెర్చేసరికి సూర్యుడు పశ్చిమాద్రికి జారిపోయేడు. పిట్టలన్నీ గూళ్ళకి చేరి గోలగోలగా అరుస్తున్నాయి.

"కోరిన వర మొసగుమయ్యా
కోదండపాణీ
పారిజాత జనకసం శ్రీ
వత్సాంక నిష్కళంక ....కోరిన...."

రామప్రియ రాగంలో నెమ్మదిగా వినిపిస్తుందామె గొంతు గాలిలో అలలు అలలుగా తేలివస్తూ. కొద్ది క్షణాలు అలా వింటూ వుండిపోయాడతడు. లేచి మెల్లగా పర్ణశాల బయటకు వచ్చాడు. ఆ 'దేవత' పావురాళ్ళతోనూ, కుందేళ్ళతోనూ కూర్చుని సన్నగా రాగాలాపన చేస్తోంది. పావురాళ్ళు కువ కువ లాడుతూ ఆమె పాదాల మీదనుంచి మోకాళ్ళపైకి ఎగురుతున్నాయి.

పొడిగా దగ్గేడు. ఆ అలికిడికి కీర్తన ఆపి అతనివంక చూసిందామె.

"లేచేరా?"

పెదాలు విచ్చీ విచ్చకుండా నవ్వేడతడు.

"నొప్పి ఎలా వుంది?" అడిగింది ఆమె అతని భుజంవంక చూస్తూ.

"మీ దయవల్ల. అంతగా నొప్పి అనిపించడం లేదు" ఆరాధనగా చూశాడామెవైపు.

"స్నానం చేసిరండి...." సెలయేరు చూపింది. అటుకేసి నడిచాడతను.

అతను స్నానం ముగించి వచ్చేసరికి పుట్టతేనె, మేకపాలు, పళ్ళు అతనిముందు పెట్టిందామె.

పాలు త్రాగుతూ చెప్పేడతను.

"నా పేరు సూర్యం ...." తలూపిం దామె। కొంచెంపేపాగి మళ్ళీ చెప్పే డతడు. "నా పేరు సూర్యం" శబ్దం బయ టకు రకుండా నవ్వింది.

"మీ పేరేమిటో చెప్పలేదు?"

"కల్యాణి"

"మీ మనసుకుమల్లె .... అందమైన పేరు"

ఆమెనూ, ఆమె ప్రవర్తననూ చూస్తున్న కొద్దీ అతనికెన్నో సందేహాలూ .... సమాధానం తెలీని ప్రశ్నలూ ఎగిసి పడుతున్నాయి. ఆమె ఎవరు? ఈ నిర్జనా రణ్యంలో మౌనిలా ఆమెజీవితం ఏమిటి? ఎన్నాళ్ళనుంచి ఇక్కడుంటోంది? కనీసం నేనెవరో, ఎందుకిలా గాయాలతో పడి వున్నానో అడగదేం? ఆసక్తిలేదా?

వింతగా చూశాడామెవైపు।

చక్రాల్లాంటి పెద్ద కళ్ళు నిష్కల్మ షంగా అఖండజ్యోతిలా ప్రకాశిస్తున్నాయి. తెల్లగా నారవస్త్రాలూ, నవ్వుతూ వుండే అధరాలు. పులి అయినా ఆమె ముందు పిల్లిలా కూర్చుని తోక ఆడించాల్సిందే అనిపించింది. వనదేవత మానవకన్యగా అవతరించిందా అని కూడా అనిపించింది.

"మిమ్మల్ని గురించి నాకెన్నో సందే హాలు కొట్టుమిట్టాడుతున్నాయి" అడిగేడు సూర్యం. "బహుశా మీకూ నా గురించి సందేహాలు వుండివుండవచ్చు"

రెండు ప్రశ్నలకూ సమాధానంగా చిన్నగా నవ్విందామె.

"మీకభ్యంతరం లేకపోతే మిమ్మల్ని 'కల్యాణీ' అని పిలుస్తాను"

"నిరభ్యంతరంగా పిలవచ్చు" తమిక్క తావిచెట్టు నానుకుని కూర్చుంటూ చెప్పింది కళ్యాణి।

సూర్యం కొంచెం దూరంలోనున్న రాతిమీద కూర్చున్నాడు.

"ఈ కీకారణ్యం మధ్యన యోగినిలా మీ జీవితానికర్థం....నా కగమ్యగోచరంగా వుంది" అడిగేడతడు.

"గమ్యం ఏమిటో తెలుసుకుందుకే ఇక్కడ జీవించదలిచాను" పావురం రెక్కలు నిమురుతూ చెప్పింది

"నే నెవరో, ఎందుకిలా గాయాలతో పడివున్నానో మీకు తెలుసుకోవాలని లేదూ...."

"అడగడం మిమ్మల్ని బాధపెట్టడం అవుతుందేమోనని...."

"నా మానసిక భారాన్ని తగ్గించినవా రవుతారని ఎందుకనుకోలేకపోయారూ?"

"మానవ జీవితం బాధల మయమే గాని, సుఖాల సారం అని నే ననుకోను" వేదాంతినిలా మాట్లాడింది.

"అందులోని సుఖాన్ని వెతుక్కో గలవారే ధన్యజీవులు."

"మీ కభ్యంతరం లేకపోతే మీకీ దెబ్బ లెందుకు తగిలాయో...." మెల్లగా నిట్టూర్చాడు సూర్యం

"నేనో విప్లవవాదిని। పోలీసులు నన్ను ఆరునెలలుగా జైల్లోవుంచి విడుదల చేస్తున్నామన్న పేరుతో నాతోపాటు మరో ముగ్గురినీ ఈ అరణ్యంలోకి తెచ్చేరు. నాతో వచ్చిన ముగ్గుర్నీ పరలోకానికి ప్రయాణం కట్టించేరు పోలీసులు. నేను తప్పించుకున్నాను. పోలీసులు పేల్చిన తూటాఒకటి భుజంలో దిగింది. ఎలాగో ప్రయాసపడి ఆ బులెట్ తీసేను. రోజంతా

## అబ్బాయిలకు - అమ్మాయిలకు....

"ప్రేమంటే...." శీర్షికలో అత్యధిక సంఖ్యలో పాల్గొన్న వారందరికీ మా కృతజ్ఞతలు. మీ ఉత్సాహం మమ్మల్ని ఎంతో ఆనందింపజేసింది. మరి.... ఈ సారి ..."ప్రేమిస్తే—" ఏమవుతుందో వ్రాయండి. "ప్రేమిస్తే...." అనే వాక్యాన్ని చక్కగా ఒక్క వాక్యంలో పూర్తిచేసి మే 15 వ తేదీ లోగా పంపండి. ఉత్తమమైన వాటిని ప్రచురిస్తాము. (సం)

తిండిలేక పోవడం వలనా, రక్తస్రావం వలనా, ఓ దేవత కుటీరం ముందు స్పృహ తప్పాను...."

అతి సాధారణంగా విన్నది కళ్యాణి.

"ఇప్పటికైనా నా సందేహాలు తీరుస్తారా?" అడిగేడు సూర్యం.

"ఈ జీవితం నీటి బుడగ వంటిదనీ, బుద్బుదప్రాయమనీ తెలుసుకొన్ననాడే ప్రజల మధ్య నా జీవనానికి స్వస్తి చెప్పాను. భగవంతుని పిలుపుకై ఎదురు చూస్తూ ఇక్కడే కాలంగడుపుతున్నాను" నిర్వేదంగా చెప్పింది కళ్యాణి.

"అంటే మీకేమీ కోరికలులేవా? రాగద్వేషాలకు అతీతురాలవా?"

"రాగద్వేషాలనేవి.... వట్టి భ్రమ! అయినా నా కెవరున్నారని రాగం చూపేందుకు.... తీరని కోరికలూ లేవు 'ద్వేషం' పెంచుకుందుకూ.

"తల్లీ - తండ్రీ, భర్తా — ఎవరూ లేరా?"

"మీరు చెప్పిన ముగ్గురూ రైలు అక్సిడెంట్‌లో పోయారు. భగవంతుని లీలావిలాసం చూశారా? వారితోనే వున్న నేను ఇలా జీవచ్ఛవంలా మిగిలేను" కన్నుల్లో శూన్యం నింపుకుంది కల్యాణి.

"అంటే మీకి జీవితంపైన కోరిక కానీ, బ్రతకాలన్న ఆశ కానీ లేవంటారు?" — కొంచెంగా హేళన తొంగి చూసింది అతని మాటల్లో.

నవ్వునే సమాధానం చేసింది కల్యాణి.

"నేను నిష్కర్షగా, నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తిని.... నా మాటలకు మీరేమీ అనుకోకూడదు. ఒక్కక్షణం ఆగి అడిగేడు సూర్యం" "మీకి జీవితంపైన ఆసక్తి కోరికా లేనపుడు ఆత్మహత్య చేసుకోవచ్చునే?" అడిగిన తర్వాత గొంతులో ఏదో అడ్డం పడ్డట్లు అనుభూతి చెందేడు సూర్యం. 'నా ప్రాణాలను కాపాడిన దేవతనా నేనిలా అడిగేను' అనుకొని బాధపడ్డాడు.

కల్యాణి కళ్ళు విప్పార్చి చూసింది సూర్యాన్ని.

"ఆత్మ, పరమాత్మలు లీనమయ్యేందుకు బలవన్మరణం మార్గంకాదు. చెట్టు

నువ్వు కాయ రాలాలంటే అది పండి తీరాలి."

"ఆత్మ అనేది ఒకటుందని నమ్ము తారా మీరు?"

"మీరు నమ్మరా? మీకు ఆత్మ లేదూ?"

"నమ్మను" దృఢంగా చెప్పాడు.

"సూర్యంగారూ.... 'నేను' అనే పదాని కర్థం ఏమిటంటారు?"

"కనిపించే ఈ శరీరమే నేను. ఈ శరీరం నాదికాదనీ, నాకు తెలియని.... నాకు కనపడని ఆత్మ అనేది ఎక్కడో వుందని ఎలా నమ్మమంటారు?"

"మీరు పొరబడుతున్నారు. ఈ శరీరానికి బట్టలు ఎలానో.... ఆత్మకు ఈ చర్మమూ, ఎముకలూ, రక్తమూ అంతే! ఏదోనాటికి ఇవి క్రుళ్ళి, నశించి పోవాల్సినటువంటివే! చివరికి మిగిలేది ఆత్మే."

"ఈ చర్మం నశించిన తర్వాత ఆత్మ ఎక్కడికి వెళ్తుందీ?"

"చేసుకున్న పాపపుణ్యాలనుబట్టి తర్వాత నిర్ణయింపబడుతుంది."

"పుణ్యం చేసుకుంటే ధనవంతుడుగానూ, పాపంచేసుకుంటే బీదవాడుగానూ పుడ్తాడంటారా?" కసిగా అడిగేడు సూర్యం.

నవ్వింది కల్యాణి. 'అ' అనే అక్షరం అలానే ఎందుకుండాలీ — అన్న పసివాడి ప్రశ్నను విన్నట్లుగా నవ్వింది.

"నా ఉద్దేశ్యం అది కానేకాదు. పాపం చేసుకున్నవాళ్ళు పాపపరిహార మయేంత వరకూ పునర్జన్మలు పొందుతూనే వుంటారు. పుణ్యంచేసుకున్నవాళ్ళు పరమాత్మలో లీనమైపోతారు. కోరికలు తీరని ఆత్మలు త్రిశంకంలో పరిభ్రమిస్తూనే వుంటాయి .... ఆ ఆత్మలనే 'దెయ్యా' లంటారు మనవాళ్ళు!

"ఆ దేవుడనే వాడు వున్నాడనీ....వాడే అన్నింటికీ మూలమనీ అంటారు మీరు?"

"ఆ భగవంతు డున్నాడు."

"నాకు చూపించ గలరూ?"


"కన్పించే ఆ సూర్యుణ్ణే తేరిపార చూడలేనివారు, ఆ భగవంతుణ్ణెలా చూడ గలరు? ముందుగా ఆ భగవంతుణ్ణి నమ్మండి నమ్మి కొలవండి మనో నేత్రం తెరవండి ఆ భగవంతుడు తప్పక కన్పిస్తాడు."

"నాలుగు చేతులూ.... నాలుగు కాళ్ళతోనూనా?" వ్యంగంగా అడిగేడు సూర్యం!

"అది మనిషి సృష్టించుకొన్న రూపం, భగవంతుడు నిరాకారుడు."

"ట్రాష్.... మీరూ పెద్దలు పలికిన చిలక పలుకులే పలుకుతున్నారు దేవుడి పేరు చెప్పి ధనికవర్గం, బీదవర్గాన్ని దోచుకుంటుంది. మనుష్యుల్ని మూఢులుగా తయారు చేస్తున్నారు.... పిచ్చివాళ్ళగా గంతులేయిస్తున్నారు.... ఉన్మాదులుగా మారుస్తున్నారు.... మూఢాచారాలకు బానిసల్ని చేస్తున్నారు" ఉద్రిక్తంగా అరిచేడు సూర్యం. కొంచెం సేపాగి అన్నాడు

"చూడండి కల్యాణిగారూ .. అనాది కాలం నుంచీ పేదవాళ్ళని, పేదవాళ్ళుగానే వుంచడానికి ధనికవర్గం సృష్టించిన ఒక సాధనం దేవుడు. బానిస వ్యవసలు బానిసలు ఎదురు తిరగకుండా వుండేం దుకు తమ ఆధిక్యతను నిలుపుకుందుకూ




ధనికవర్గం ప్రయోగించిన అస్త్రాలే పాప, పుణ్యాలు! ఇది ఫ్యూడల్ వ్యవస్థ! ఈ వ్యవస్థలో తమ ప్రయోజనాలకోసరం పై వర్గం సృష్టించిన రూపాలే మతాలూ.... దేవుళ్ళూనూ! కల్యాణి గారూ.... ఒక్కసారి ఆలోచించండి అసలీ మతాలూ, దేవుళ్ళు ఎవరికి ఉపకారం చేసినయ్! పైనున్నవాణ్ణి మరింత ఎత్తుల్లో నిలబెట్టేందుకు, క్రిందనున్న వాణ్ణి అధఃపాతాళానికి అణచివేసేందుకూ దోహదకార్లు అయినయ్...." ఆవేశంతో చెప్పసాగేడు సూర్యం.

"సూర్యచంద్రులు, ఉదయం పూట' సాయంకాలం పూట తమ బింబాల అభివృద్ధి చూపడానికి కారణం ఆ యా సమయాల్లో వేడి, వాటి కాంతి కిరణాలు వక్రీభవనం చెందడమే అన్న సత్యం చెప్పినందుకు ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు 'బేకన్' కారాగారవాసం అనుభవించాల్సి వచ్చింది. ఈ విశ్వంలో లెఖ్ఖలేనన్ని నక్షత్రా లున్నాయని మత గ్రంథాలకు ఎదురు చెప్పినందుకు 'బ్రూనో' ను రోమ్‌నగర్ వీధుల్లో కాల్చిచంపేరు. చంద్రుణ్ణి దేవుడుగా పూజించే రోజులు పోయి, చంద్రగ్రహంపైని మానవుడు కాలూనేడు. శాస్త్రజ్ఞానం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతూంది.... మనిషికి అసాధ్యమైనదంటూ ఏమీ లేదు...."

కల్యాణి నవ్వు అతడి మాటలకు అడ్డుకట్ట వేసింది.

"ఏమిటి....నవ్వుతున్నారు...."కళ్ళు చికిలించి అడిగేడు.

"పితికిన పాలని తిరిగి పొదుగులోకి పంపించగలడా? చనిపోయిన వారిని తిరిగి బ్రతికించగలడా - మీ మనీషి?" నవ్వి అడిగింది కల్యాణి.

"మీ దేవుడుచేయగలిగాడా ఇవన్నీ?" ఉక్రోషంగా అన్నాడు సూర్యం.

"గతంలో ఎన్నో దృష్టాంతరాలు వున్నాయి."

"పుస్తకాల్లో చదివేరా?" అడిగేడు సూర్యం.

"గతం గురించి తెలియజేసేవి పుస్తకాలు కాక మరేవిటి?"

దానికి సమాధానం ఏం చెప్పాలో తెలియని సూర్యం తడబడి పోయేడు.

చిన్నగా నవ్వి చెప్పసాగింది కల్యాణి.

"భగవంతుడు లేడనుకోవడం తప్పు సూర్యంగారూ! ఆ దేవుడు "చరాచరా"లన్న భేదం లేకుండా సకల జగత్తంతా నిండి వున్నాడు ...మీలోనూ వున్నాడు.... నాలోనూ వున్నాడు! మనిషి చావు పుట్టుకలు విధి చేతిలో వున్నాయి. ఆ భగవంతుడే లేకపోతే, ఈ సకల జగత్తునూ, విశ్వాంతరాళంలో తేలియాడే ఆ నక్షత్రాలనూ, ఆ నక్షత్రాలకు స్వయంప్రకాశాన్ని ఎవరు కల్పించారంటారు? సకల ప్రాణికోటికి ఆధార భూతమైన గాలి,నీరు లను ఎవరు సృష్టించేరు? ఎటువంటి ఘన పదార్థమైనా జీర్ణమైపోయే స్త్రీ ఉదరంలో శిశు వెలా పెరగగలుగుతున్నా డంటారు? పుడమి తల్లి గర్భంలోని బొగ్గే వజ్రంగా మారే రసాయనిక ప్రక్రియ ఏమిటి? ఇవన్నీ ఏ మనిషికీ సాధ్యంకానివి.... మరే ప్రాణీ సృష్టించలేనటువంటివి! కనీసం మన ఊహకు కూడా అందనివి సూర్యంగారూ—భగవంతుని లీలలు!" నిర్మలంగా చెప్పింది కల్యాణి!

"మన ఊహకు అందని వాటి నన్నింటినీ భగవంతుని లీలలుగా అన్వయించడం మనకు పరిపాటయి పోయింది" సూర్యం మధ్యలో చెప్పేడు.

"నాస్తికత్వం అనే రంగుటద్దాలనుంచి లోకాన్ని చూడకండి. "దేవుడున్నాడేమో" అన్న సందేహం చాలు! అదే మిమ్మల్ని భగవత్సాన్నిధ్యానికి చేరుస్తుంది" దృఢంగా చెప్పింది కల్యాణి.

"నేనా భగవంతుని చూడగలిగిననాడు తప్పకుండా నమ్ముతాను" మొండిగా అన్నాడు సూర్యం.

"అందుకుగాను కొంత నిరీక్షణ ... దేవునియందు నమ్మకం అవసరం."

"ఆ దేవుడు కనపడి ఒకే ఒక్కసారి "నే నున్నాను" అని ఋజూపర్చుకుంటే నాలాంటి వారు ఎందరో మారతారు గదా" సవాల్ విసుర్తున్నట్టు చూసేడు.

"భగవంతుడికా అవసరం లేదు."

చిన్నగా నవ్వి అన్నాడు సూర్యం "నిజం కల్యాణిగారూ....మన పూర్వీకులు చాలా తెలివైనవాళ్ళు. ఆస్తికత్వపు పాశాన్ని మన నరనరానా "ఇంజెక్టు" చేసేరు."

"సూర్యంగారూ....మీరుపుట్టకముందే మీ తండ్రి చనిపోయా రనుకోండి. అపుడు మీ నాన్నను మీరు చూడడం అసాధ్యం! అంతమాత్రాన మీకు తండ్రే లేరంటారా?"

"మీరు ఉపమానం చక్కగా చెప్పేరు....కాని, నా తండ్రిని నేను చూడలేకపోవచ్చు....నా తల్లి చూపింది. చూసిన ప్రజ చాలామంది వుంటారు...."

"అలాగే భగవద్దర్శనమూ పొందిన వాళ్ళు లేకపోలేదు!"

"ఏది ఏమైనా కావచ్చు .... కల్యాణి గారూ, వాదన అనేది రెండువైపులా పదునున్న కత్తి లాంటిది....అందులో

ఎవరైనా వెగ్గవచ్చు!" కొద్ది క్షణాలాగి మళ్ళీ సూర్యమే అన్నారు.

"మీ రుండతగ్గ ప్రదేశం కాదిది! జన పదాల్లో మీ చేత సేవలు పొందవలసిన ప్రజ ఎందరో వున్నారు. అన్నార్తు లున్నారు.... నిరక్షరాస్యు లున్నారు.... వికలాంగు లున్నారు....మీకు చేతనైన రీతిలో వాళ్ళకు సాయం చేయవచ్చు.... ఆ భగవంతుని మీ రా అభాగ్యులలో చూడలేరా?"

"ఇక్కడ వున్న ప్రశాంతిని జన పదాల్లో పొందడం సాధ్యమే నంటారా?"

"ఆమాత్రం సుఖాన్ని త్యాగం చేయలేరా...." అభ్యర్థిస్తున్నట్లుగా అడిగేడు సూర్యం.

మవునంగా వుండిపోయింది కల్యాణి.

చంద్రుని వెన్నెల చెట్ల రెమ్మలందుగుండా ఆ అడవిలోకి ప్రవేశించేందుకు ప్రయాణిస్తోంది. కీచురాళ్ళు రొద చేస్తున్నాయి. వింత శబ్దంతో గాలి వీస్తోంది.

పర్ణశాలలో దీపంవెల్గించింది కల్యాణి! దీపం వెలుతురులో కల్యాణి నీడ అటూ-ఇటూ కదుల్తోంది!

"రాత్రి చాలా గడచిపోయింది. పడుకోండి" సూర్యంతో చెప్పింది కల్యాణి

"కల్యాణీ....నిన్నిలా ఏకవచనంలో సంబోధించా లన్పిస్తోంది....ఏమీ అనుకోవు గదూ" తలక్రింద చేతులు పెట్టుకుని కృష్ణాజినంమీద పడుకున్న సూర్యం అడిగేడు.

"బహువచనంలో "గౌరవం" కన్పిస్తుంది. ఏకవచనంలో ఆత్మీయత అంకురిస్తుంది" కల్యాణి చెప్పింది.

సూర్యానికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. సమయం అంతా సందేహాలతోనే కరిగిపోయింది. తెల్లవారు ఝామున నిద్ర పట్టింది సూర్యానికి!

వెచ్చగా తగిలిన సూర్య కిరణాల తాకిడికి నిద్రలేచాడు! పిట్టలన్నీ కోలాహలాన్ని సృష్టిస్తున్నాయి. కల్యాణి మేకపాలు పితుకుతూ "వాచస్పతి" రాగం ఆలాపిస్తోంది.

"పరాత్పర పరమేశ్వర పార్వతీపతి హర పశుపతీ...."

సూర్యం లేచి బయటకు వచ్చాడు. కల్యాణి కళ్ళతోనే పలకరింపుగా నవ్వింది. సెలయేట్లో స్నానం చేసి వచ్చేడు. కల్యాణి మేకపాలు ఇచ్చింది సూర్యానికి!

"నే వెళతాను ఇక" పాలు త్రాగి చెప్పేడు సూర్యం.

"వెళ్ళవస్తాను అనాలి" చిన్నగా నవ్వుతూ చెప్పింది కల్యాణి.

"పోలీసులు మళ్ళీ నన్నీ అడవిలోకే తీసుక రావాలని "మీ దేవుణ్ణి" ప్రార్థిస్తాను" నవ్వేడు సూర్యం.

"కల్యాణీ. నీ ఆతిధ్యం ఈ జన్మలో మరిచిపోను ... పోలేను కూడానూ" ఆరాధనగా చూసేడు.

"కల్యాణీ ఒక్కక్షణం కళ్ళుమూసుకుంటావూ?" జాలిగా అడిగేడు సూర్యం.

కళ్ళు మూసుకుంది కల్యాణి.

వంగి ఆమె పాదాలను మృదువుగా చుంబించేడు!

ఆ స్పర్శకు కళ్లు తెర్చింది కల్యాణి.

ఆమె కళ్ళలో అశ్రుబిందువులు మెరిసినయ్!

"కల్యాణీ! నాకు ఇక్కడే శాశ్వతంగా వుండిపోదామని వుంది. ఈ ప్రశాంతతను నే నింత వరకు ఎక్కడా పొందలేదు. కాని నా కర్తవ్యం వెన్ను తడుతోంది. వెళ్ళేముందు ఒక్కమాట. ఉన్నాడో, లేడో తెలియని దేవుణ్ణి ఊహించుకుంటూ శూన్యంలోకి చూస్తూ నువు పొందే శాంతి, నీ చేత క్షుద్బాధ తీర్చుకున్న తర్వాత ఓ అన్నార్తుడు చూసేచూపుకూ, నీ చేత సేవలు పొంది కోలుకున్న తర్వాత ఓ రోగి నీ వంక కృతజ్ఞతగా చూసేచూపుకూ, నీ వలన విజ్ఞానవంతుడైన ఓ నిరక్షరాస్యుడు నీ వంక ఆరాధనగా చూసే చూపుకూ - దీటురాదు! అపుడు నువుపొందే శాంతికి సాటిరాదు! ఆ రోజున ప్రతి మనిషి లోనూ నీకు దేవుడే కన్పిస్తాడు.... వస్తాను కల్యాణీ!"

చెట్ల చాటున కనుమరుగైపోయేంత వరకూ అతనివంకే చూస్తూ వుండిపోయింది కల్యాణి! అనుకోకుండానే ఆమె కనుల వెంట అశ్రుకణాలు జారిపడినయ్.

సూర్యుడు మింటికెగిసేడు. పశ్చిమాద్రికి జారిపోయేడు.... తిరిగి ఉదయించాడు. పక్షులు కిలకిలా రావాలు చేస్తూనేవున్నాయి .... చెట్లు గాలికి తల లూపుతూనే వున్నాయి. కుందేళ్ళు పొదలలో సవ్వడి చేస్తూనే వున్నాయి! మేక పర్ణశాలలోని గరిక కొరుకుతూనే వుంది.

సూర్యం వెళ్తూ చెప్పిన మాటలే కల్యాణి చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"నేను యాంత్రికంగా జీవితంగడుపుతున్నానా?" తనకు తనే అనేక సార్లు ప్రశ్నించుకుంది కల్యాణి.

పొట్ట వెన్ను నంటుకపోయి "అమ్మా....ఆకలి" అంటూ అరిచే భిక్షుకుడు కన్పించేడు. త్రోవ కన్పించక కర్రను తాటించుకుంటూ రోడ్డు ప్రక్కన నడిచే పాంథుడు జ్ఞాపకానికొచ్చాడు - ఒంటిపైన గుడ్డలేక చలికి గజగజలాడుతూ "ప్లాట్‌ఫాం" మూలన ముడుచుక పడుకున్న పిల్లలు కన్పించేరు. జానెడు పొట్ట నింపుకోడానికి శీలాన్నే పణంగా పెట్టిన వెలయాలు కన్పించింది! వికృతమైన రూపాలతో. వికారంగా అరుస్తూ....అసహాయంగా అరుస్తూ.... అసహాయంగా అరుస్తున్నాయి అనేక వేల గొంతులు!

స్థిర నిర్ణయాని కొచ్చిన దానిలా జనపదం వైపు చూపు సారించింది కల్యాణి. కాలుసాగించింది!

"కల్యాణీ! కక్షలకు, కావేషాలకు, కుట్రలకు, కుతంత్రాలకు, కష్టాలకు, కన్నీళ్ళకు, అన్యాయాలకు, అక్రమాలకు నిలయమైన ఈ సంఘంకన్న, నీ సన్నిధి లోనే నాకు ప్రశాంతంగా వుంది. రాగద్వేషాల కతీతంగా, కోరికలేవీ లేకుండా ఆ భగవంతుని అన్వేషిస్తూ నీ పర్ణశాల లోనే తల దాచుకుందుకొచ్చేను ...నాకు కొంచెం చోటివ్వవూ" అని అభ్యర్థించ డాని కొచ్చిన సూర్యానికి పర్ణశాల నిర్జీవంగా కన్పించింది!

పర్ణశాలలో కల్యాణి కోసం ఎదురు చూస్తూనే వున్నాడు సూర్యం!